చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

● అవయవాలు దానంచేసిన కుటుంబ సభ్యులు

కందుకూరు, జనవరి 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతుడి అవయవాలను దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కందుకూరు పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పెద్దొళ్ల ప్రశాంత్ రెడ్డి.. గత నెల 28న విధులను ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మలక్‌పేట్‌లోని యశోద వాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతుడి తండ్రి, మాజీ ఏఎస్సై నాగిరెడ్డి, భార్య సౌమ్యలు పెద్ద మనస్సుతో జీవన్‌దాన్‌కు మృతుడి కిడ్నీలు, కాలేయాన్ని దానం చేశారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధను గుండెల్లో దాచుకొని అవయవా లను దానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులను రాచకొండ సీపీ సుధీర్ బాబు అభినందించారు. అవయవాలను దానం చేసినవారు భౌతికంగా మరణించినా జీవించి ఉన్నట్లేనని అన్నారు. కానిస్టేబుల్ ప్రశాంత్‌రెడ్డి అంత్యక్రియ ఖర్చులకు రూ.90వేలను సీపీ మంజూరు చేశారు. అంత్యక్రియల్లో సీఐ సీతారాం, సంఘం అధ్యక్షుడు భద్రా రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, పోలీసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

9వ డివిజన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్డును పరిశీలించిన కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట, జనవరి5: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి తీసుకోకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కమిషనర్ సరస్వతి హెచ్చరించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల పై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని నిర్మాణ దారులను ప్రశ్నించారు. మున్సిపల్‌కు సంబంధం లేకుండా ఎవరికి వారు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఎన్ని డివిజన్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో పరిశీలిస్తామన్నారు. నిత్యం అక్రమ నిర్మాణాల పై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అక్రమ నిర్మాణాలు నిజమేనని తన దృష్టికి వచ్చిన్నట్లు అంగీకరించారు. 32 డివిజన్లలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అక్రమ నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇంటి నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. విచ్చల విడిగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి వారిపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని డివిజన్లలో పర్యటిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అక్రమ నిర్మాణాల జాబితా తెలుస్తుందన్నారు. అక్రమ నిర్మాణాల జాబితా పై అధికారులకు అందజేస్తామన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఉంటాయన్నారు. ఇక నుంచి ఎవరైనా మున్సిపల్ అనుమతి తీసుకున్న తర్వాతనే ఇంటి నిర్మాణం చేపట్టాలని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు,జనవరి 5 : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 98 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 42,00,000 విలువ గల చెక్కులను అందించారు.

నాగులపల్లిని తట్టేపల్లి మండలంలో విలీనం చేయవద్దు

పెద్దేముల్, జనవరి 5:మండల పరిధిలోని తట్టేపల్లి నూతన మండలంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరుగడంతో నాగులపల్లి గ్రామస్తులు తమ గ్రామాన్ని విలీనం చేయవద్దని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాన్ని పెద్దేముల్ మండలంలోనే కొనసాగించాలని ఎమ్మెల్యేని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్, నాగిరెడ్డి, నందుకుమార్, మల్‌రెడ్డి, విక్రమ్ పటేల్, రాజు, నవీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్, మాజీ జడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల-ప్రభాకర్‌గుప్తా దంపతులు

పరిగి, జనవరి 5: మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పేర్కొన్నారు. ఆదివారం పరిగిలోని మార్కెట్‌యార్డులో పూడూరు మాజీ జడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో విజేతలకు మున్సిపల్ చైర్మన్ అశోక్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంక్రాంతికి పల్లెలతోపాటు పట్టణాల్లో ప్రతి ఇంటిముందు రంగురంగుల ముగ్గులతో మన సంస్కృతికి చిహ్నాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. రంగురంగుల ముగ్గులు పండుగ వాతావరణం ఉట్టిపడేలా చేస్తాయని, ప్రతి ఇంటికి శోభను ఇస్తాయన్నారు. ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి సి.శ్రావణికి రూ.5000, ద్వితీయ బహుమతి వేముల పుష్పలతకు రూ.3000, తృతీయ బహుమతి యు.సంధ్యకు రూ.2000, నాలుగవ బహుమతి ఎం.రజితకు మున్సిపల్ చైర్మన్ అశోక్, మాజీ జెడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల-ప్రభాకర్‌గుప్తా దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మధుసూదన్, మహిళా విభాగం అధ్యక్షురాలు పాలిశెట్టి సువర్ణ, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

● వర్సిటీ విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల పథకాన్ని పునరుద్ధరించాలి

● బీసీ విద్యార్థి మహాసభలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

ఓయూలో జరిగిన బీసీ విద్యార్థి మహాసభలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 5: ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వర్సిటీ విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా బీసీ విద్యార్థి మహాసభను నిర్వహించారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుల్ మెస్ చార్జీలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులపై భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని అన్నారు. రాష్ట్రంలో 300 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉంటే ఒక్కదానికి కూడా సొంత భవనం లేదని గుర్తు చేశారు. కళాశాల హాస్టల్ విద్యార్థులకు బస్ పాస్, ఇతర చిల్లర ఖర్చులకు ప్రతి ఒక్కరికి నెలకు బాలికలకు రూ.1000, బాలలకు రూ.800 పాకెట్ మనీ మంజూరు చేయాలని అన్నారు. అన్ని ప్రొఫెషనల్ కోర్సులు, ఇంటర్మీడియల్ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కోర్సుల ఫీజుల గరిష్ట పరిమితి ఎత్తివేయాలని కోరారు. ఫీజు బకాయిలను తక్షణమే ఒకేదఫా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా 150 బీసీ కళాశాలల హాస్టళ్లు మంజూరు చేయాలని అన్నారు. ప్రతీ హాస్టల్‌కు కంప్యూటర్లు సమకూర్చాలని చెప్పారు.

రైతుభరోసా ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి, జనవరి 5 : ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఎకరాకు సంవత్సరానికి రూ.15వేలు అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పరిగిలో జరిగిన పరిగి ఏరియా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి, నేడు రూ.12వేలు ఇస్తామనడం దుర్మార్గం అన్నారు. వానాకాలం రైతు భరోసా డబ్బులు సైతం వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను ఇంటి స్థలం లేని పేదలకు మంజూరు చేయాలని, వారికి 120 చదరపు గజాల స్థలం ఇవ్వాలన్నారు. రంగాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 19లో గల 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. పరిగిలోని సాధన ఆసుపత్రిలో మహిళ మృతిపై వైద్యాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి, ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాధన హాస్పిటల్ ఘటనపై ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సమ్మ, హబీబ్, సత్తయ్య, రఘురాం, శేఖర్, మొగులయ్య, లాలప్ప, రాంచెంద్రయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థను అంతం చేస్తేనే అభివృద్ధి

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

బహిరంగ సభలో మాట్లడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

చిక్కడపల్లి, జనవరి 5 : కుల వ్యవస్థ భూతాన్ని అంతం చేస్తేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్ఎం) 2వ మహాసభల ప్రారంభం సందర్భంగా ఆదివారం ఇందిరాపార్కు వద్ద బహిరంగ సభను నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం ఆధ్యక్షతన జరిగిన ఈ సభకు డి.రాజా హాజరై ప్రసం గించారు. భారత దేశంలో సామాజిక అభివృద్ధి, సంస్కరణలు, అభివృద్ధికి వేలాది ఏండ్లుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ భూతం గా మారిందన్నారు. కుల వ్యవస్థ భూతాన్ని అంతం చేస్తే దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. రాజ్యాంగ పరమైన పదవుల్లో ఉండి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన అమిత్ షా తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రూపొందించిన రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సమసమాజ స్థాపనతోనే అసమానతలు, నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఈ సభలో ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, బీకేఎంయూ జాతీయ ప్రధాన కర్యాదర్శి బోరియా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నర్సింహా, ఎం.బాలనరసింహా, ఏఐడీఆర్ఎం జాతీయ నేతలు సుబ్బారావు, శివకుమార్, రవీంద్ర చారి, చాయదేవి, తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

పరిగి, జనవరి 5 : పరిగి మండలం నస్కల్ గ్రామంలో మత సామరస్యం వెల్లి విరిసింది. నస్కల్ గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు ఎం.డి.అఫీజ్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు ఆదివారం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ విందు ద్వారా అందరం ఒక్కటే అని చాటి చెప్పారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు..



వికారాబాద్, జనవరి 5 : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆదివారం ట్రెస్మా సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, ట్రెస్మా వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు బి. కృష్ణయ్య , ప్రధాన కార్యదర్శి జి.విజయేందర్, ట్రెసా వికారాబాద్ జిల్లా సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మునీరుద్దీన్, విజయ్ కుమార్, సురేశ్‌కుమార్, విజయ్, బాలరాజ్, నరేందర్, రవి కిషోర్, పాండు, రమేశ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు పూర్తి

తాండూరు రూరల్, జనవరి 5 : తాండూరు మండలం, కొనాపూర్‌లో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్డు పనులు చేశామని నాయకులు వెంకటేశ్, రాజూగౌడ్, వెంకటయ్య తెలిపారు.

ఆటోబైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కులకచర్ల, జనవరి 5 : ఎదురుగా వస్తున్న ఆటో బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన కులకచర్ల మండల ఫరిధిలో జరిగింది. ఆదివారం సాయంత్రం కులకచర్ల నుంచి బండ వెల్కిచర్లకు వెళుతున్న ఆటో పాంబండ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనిడంతో బైక్‌పైన ఉన్న గోపాల్, మల్లేశ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన ఇద్దరికి 108లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరు పరిగి మండలం మల్లెమోనిగూడకు చెందినవారని తెలిపారు.

ప్రగతిశీల ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్‌కు హాజరైన విద్యార్థి నాయకులు

ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 5: ప్రగతిశీల ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి 77వ జయంతి సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరం యువత శారీరక దృఢత్వం, అధ్యయనం వంటి పద్ధతులు పాటించేందుకు ప్రత్యేకంగా ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. వర్సిటీ విద్యార్థులు సమాజ మార్పునకు జార్జిరెడ్డి వంటి నేతలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఎన్. సుమంత్, కె.స్వాతి, వెంకటేశ్, అం జి, కోటేశ్వర్, శివకుమార్, ధనుశ్, సతీశ్, నవ్యశ్రీ, ప్రణీత, సంతోశ్, పవన్, ఆర్తి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 5 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్ ఘడ్ సబ్ డివిజన్-8 డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జమాల్ కాలనీ, 11కేవీ మూసారాంబాగ్, 11కేవీ పల్టన్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ అరుంధతి కాలనీ, 11కేవీ గడ్డిఅన్నారం, 11కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4. 30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

హఫీజ్‌పేట్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్య

మియాపూర్, జనవరి 5 : గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసు కున్నది. సీఐ క్రాంతి వివరాల ప్రకారం..ఠాణా పరిధిలోని హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30-35) హత్యకు గురైనట్లు ఆదివారం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి తలపై సిమెంట్ ఇటుకతో కొట్టడంతో తీవ్ర రక్త స్రావమై ఘటనా స్థలంలోనే మృ తిచెందినట్లు గుర్తించారు. మృతుడు ..5.5 అడుగులున్నాడని , తెల్ల చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు, బ్లాక్ జాకెట్ ధరించినట్లు సీఐ తెలిపారు. మృతుడి శరీరంపై కుడివైపునకు లవ్ సింబల్ ఉన్నట్లు పేర్కొన్నారు.

గంటల్లోనే గుర్తింపు..

● ఆడుకుంటూ తప్పిపోయిన చిన్నారి..

● సీసీ కెమెరాలతో గుర్తించి తల్లికి అప్పగింత

తప్పిపోయిన చిన్నారి, తల్లిదండ్రులతో పోలీసులు

చార్మినార్, జనవరి 5 : ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారి తప్పిపోగా.. ఫిర్యాదు అందిన గంటల్లోనే సీసీ కెమెరాలు జల్లెడపట్టి చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే హరిషయా బేగం కుమారుడు (4) ఆదివారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. గుర్తించిన బాలుడి తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ బాలస్వామి.. కేసును ఎస్సై నరేందర్‌కు అప్పగించి.. విచారణ వేగవంతంగా చేయడానికి మూడు టీంలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు జల్లెడపట్టి.. హర్షియాబేగం ఇంటి నుంచి కొంత దూరంలో చిన్నారిని గుర్తించారు. వెంటనే చిన్నారిని తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్, తదితరులు

ఎల్బీనగర్, జనవరి 5: లింగోజిగూడ ఎస్సీ శ్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు కమిటీ సభ్యుడు పార్శపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డిని సన్మానించి స్థానిక లింగోజిగూడ విజయపురి కాలనీలోని ఎస్సీ శ్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తను, ముళ్లపొదలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. తక్షణం జేసీబీతో శ్మశాన వాటికను క్లీన్ చేయాలని ఎల్బీనగర్ ఎంఎంఓహెచ్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, యాదగిరి, ఆనంద్‌రాజ్, కృష్ణ పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE SHADNAGAR.
O.S.No 167 of 2024
Between:
Mekaguda Haritha ...Plaintiff.
And
Sandya and others ...Defendants
To,
1. Sandya W/o. Ramesh Reddy, age 45 years, occupation house hold, Resident of Arundathi Plaza Apartment No.101, Baswapura, Hyderabad.(D-1)
2. M. Karunakar Reddy S/o. Late Damodar Reddy, R/o. Raikal Village, Farooqnagar Mandal, Rangareddy district.(D-3)
Whereas the Plaintiff has filed suit for specific performance of agreement of sale of the suit schedule property against that you as Defendant No.1 and 3 in above suit and the same is posted for your appearance on 09-01-2025.
Therefore, your hereby directed appear before the above said court, on 09-01-2025 at 10-30 in person or through pleader; otherwise the matter will be set ex-parte in your absence.
Date: 05-01-2025
//By Order of the Court//
Sd/- V.Vijaya Bhasker Goud
Advocate
H.No.7-36/7, Shbhashiva Colony, Shadnagar, Farooqnagar, Rangareddy District.
Cell No.9866693642.